స్కెచ్

# శాంతికి మార్గం

మన్నవ గిరిధరరావు

రాత్రి పదకొండు కావస్తున్నది. దిండుమీద తలవాల్చాను. అంత సులువుగా నిద్ర పట్టే సూచనలేవీ గోచరించటంలేదు. బల్లమీది 'పత్రిక' అందుకొని పేజీలు తిరగవేస్తున్నాను. నా దృష్టి బొమ్మలమీదికి పోయింది. జర్మన్ వైమానికుని చిత్రం కంటికి తగిలింది. తీక్షణమైన చూపుతో ఠీవిగా నిలబడి వున్నాడు. యుద్ధ నేరస్తుడిగా వానిని అంతర్జాతీయ న్యాయస్థానం విచారణ చేస్తున్నది లండన్ మీద బాంబులు దొర్లించాడని వానిమీద దోషం ఆరోపించ బడింది.

చేతిలో పత్రిక జారిపోతున్నది. కళ్లు నా అదుపులో లేవు. మెదడు కూడా ప్రక్కకు వాల్చిన గుర్తు. 'మరో ప్రపంచంలో' ప్రేక్షకుడనయాను.

ఫ్రాన్సులో ఒక విమానాశ్రయం. విమాన దళాధిపతి వచ్చాడు. జర్మన్ వైమానికుడిని పిలిచాడు, వాతావరణం నిర్మలంగా వున్నది. మారణహోమానికిదే లగ్నం. వైమానికుడు నెల తిరిగేసరికి నాలుగువందలు పుచ్చుకొనేవాడాయె. చేయబోయే పని మానుషమో అమానుషమో అతనికి పట్టలేదు. పట్టదు కూడాను. తన 'విధి' ప్రకారం తక్షణం సంసిద్ధుడయాడు.

'ఇదిగో! ఈ పటం చూడు! నీవు డోవర్ మీదుగా లండన్ వెళ్లాలి. ఇలా చూడు! నువ్వు ఈస్టెండులో వున్న హాస్పిటల్ మీదా, చర్చిమీదా, ప్రజల భవనాలమీదా బాంబులు వేసి రావాలి. తెలిసిందా!'

'చిత్తం.' మారు మాటాడకుండా పుష్కలంగా బాంబులు తీసికొని బయలుదేరాడు వైమానికుడు. ఇట్టే ఇంగ్లీష్ ఛానల్ దాటి లండన్ చేరుతున్నది విమానం.

విమానదాడి సూచన ఇవ్వబడింది చర్చిలో చేసీ చేసీ ప్రార్థన సగంలో కట్టిపెట్టారు. ఎక్కడి శకటాలు అక్కడ ఆగిపోయాయి. తినేతినే తిండిని వదిలారు కొందరు. ఎవరికి తోచిన గోతిలో వారు దాక్కున్నారు గుట్టుచప్పిడిగా. ఆస్పత్రి రోగుల కేకలు ఆలకించిన నాథుడు లేడు. పసిపిల్లల రోదన వినిపించిన తల్లి లేదు. ఎవరి ప్రాణం వారికి తీపి!

వైమానికుడు స్విచ్ నొక్కాడు, బాంబులు కురిపిస్తున్నాడు. విమానం పిశాచ తాండవం చేస్తున్నది. నేలమీద మంటలు లేచాయి. ఆకాశమంతా పొగలమయం. ఆస్పత్రి పీనుగుల మయం. చర్చి అంతా నేలమట్టం! భవనాలన్నీ దగ్ధమవుతున్నాయి. విమానంలో బాంబులు అయిపోయాయి. తన 'విధి' నిర్వర్తించుకొనిన వైమానికుడు ఇంటిముఖం పట్టాడు. ఇంతలో బ్రిటిష్ విమానాలు అడ్డం తగిలాయి. విమాన విధ్వంసక శతఘ్నులు విరామం లేకుండా కాల్పులు సాగించాయి. జర్మన్ విమానానికి నిప్పు అంటుకున్నది. విధిలేక వైమానికుడు పారచూట్ ద్వారా ఇంగ్లండు గడ్డమీద అడుగు పెట్టాడు. వైమానికుడు సొమ్మసిలిపడిపోయాడు. అతడు కండ్లు తెరచి చూచేసరికి అతడు చాలా మంది మధ్యవున్నాడు. అందరూ కండ్లు పెద్దవి చేసి పండ్లు పటపట లాడిస్తున్నారు. 'వీడే! వీడే! మనకు దీపం పెట్టుకునే ఇరువులేకుండా చేసింది వీడే! మన కొంపలన్నీ కూల్చాడు. చంపండి! పొడవండి! తన్నండి' మరొకరు అందుకున్నారు. 'పసిపిల్లల్నీ, ఆడంగులనీ పొట్టనపెట్టుకున్నాడు. ఆస్పత్రి ధ్వంసం చేశాడు. వాడిని చీల్చి ఎండవేయండి. పాపం అన్నవారికే పాపం వస్తుంది. తన్నండి వాడిని!'

'ఆగండి! ఆగండి! వాడు యుద్ధ ఖైదీ, వాడిని బాధించకూడదు. గౌరవంతో చూడాలి మనం.'

'గౌరవమా! అవ్వ! వీడికా? ఈ హంతకుడికి గౌరవ మెందుకు?'

'మనం ఒకటి గుర్తుంచుకోవాలి. ఇక్కడ జర్మన్ యుద్ధఖైదీని ఒకడిని మనం చిత్రవధ చేస్తే, అక్కడ బెర్లిన్‌లో ఒక బ్రిటిషు యుద్ధ ఖైదీకి చిత్రవధ తప్పదు.'

అంతా ఒక్క క్షణం నిశ్శబ్దంగా నేలవంక చూశారు. తమ బ్రిటిషువాడికి హాని జరుగుతుందనగానే అంతా తగ్గారు. జర్మన్ వైమానికుడిని కొడవాలనీ, చంపాలనీ అన్నవారంతా అతనికి అన్ని వసతులూ కల్గించాలన్నారు. వైమానికుడిమీద విరుచుకుపడిన వాడే అతనికి పరచర్య చేయటానికి సిద్ధమయినాడు.

'నాకు తెలియక అడుగుతాను: అసలు నేనంటే మీకింత కోపం దేనికి?' అని అడిగాడు జర్మన్ వైమానికుడు. ఒక్క క్షణం తమాయించి ఇంకా చెప్పుతున్నాడు. 'మీ భవనాలన్నీ తగలబెట్టాలని నిజానికి నా ఉద్దేశంగాదు. మీ చర్చిలను దగ్ధం చేయటం గూడా నా మతంకాదు. అసలు నాకేమి అవసరం? నేనుమాత్రం క్రైస్తవుడను కాదా?...ఐతే లండన్‌ను బాంబు చేయమని ఆర్డరు వస్తే నాకు చేయక తప్పదు. అది నా విధి అని మీకు తెలుసు. ఆ మాటకువస్తే - ఒకవేళ బెర్లిన్‌మీద బాంబులు వేయమని ఆజ్ఞ వస్తే మీరుమాత్రం వేయరూ?'

'బెర్లిన్ పట్టణం మసిచేసిరానూ!'

'అవునుమరి' అన్నాడు వైమానికుడు.

'కాని, అసలు మన దేశాలు యుద్ధాలు ఎందువలన చేస్తున్నాయి?'

'నాకుగూడ సరిగా ఊహ లేదు. మన రాజకీయ వేత్తలే వీటికి పూర్తిగా కారకులనుకుంటాను.'

'అలాగయితే ఈ వెధవలనందరినీ నిలబెట్టి ఊచకోత కోయాలి.'

'కాని మాకు మా రాజకీయవేత్తలంటే మహా గౌరవం. ఎలా చంపగలం?'

'మా వాళ్ల మీదకూడా మాకు గౌరవం వున్నది.'

వారిలో రెండవవాడందుకున్నాడు. 'అయితే నాకొక వుపాయం తట్టుతున్నది. మీ రాజకీయ వేత్తలనందరినీ మేము సఫా చేస్తాము. మా రాజకీయ నాయకులందరినీ మీరు చంపండి. అపుడు సామాన్య ప్రజానీకం మిగులుతుంది. మరి సామాన్య జనులు ఒకరినొకరు ద్వేషించుకోరు. కనుక యుద్ధాలేర్పడవు.'

'భలే ఉపాయం చెప్పావ్' అని ఇంగ్లీషువాడు వైమానికుడి భుజం తట్టాడు. కాంతి కామ్రేడు లిరువురూ సంతోషాతిరేకంతో టీ తీసుకొంటున్నారు. వేడి టీ నాలిక చుర్రుమన్నది.

* * *

మూతిమీద నల్లి కుట్టినట్లుంది. చటాలున లేచి కూర్చున్నాను. కుట్టిన నల్లిని భద్రంగా చేతితో తీసి అవతల పారేశాను. దీప మార్పటం మరచాను కాబోలు. లాంతరింకా వెలుగుతున్నది. దానిని ఆర్పి తిరిగి దుప్పటి కప్పుకొని నడుము వాల్చాను.

(ఆంగ్లనుండి అనువాదం)

# జాతీయ "తత్వం"

ఏమిరాజ్యం ఏమిరాజ్యం
ఈ స్వరాజ్యం తమ్ముడా!
మాయరాజ్యం మంత్రరాజ్యం
ఈ స్వరాజ్యం తమ్ముడా!
దేశ మనియెడి దొడ్డ వృక్షం
అన్న దెవరురర తమ్ముడా!
దేశ మనియెడి దొడ్డ వృక్షపు
దుంప తెంపిరి తమ్ముడా!
దేశమంటే మట్టికాదని
నమ్మితావుర తమ్ముడా?
మట్టి కాకుంటేను ఏమిటి
మంత్రి పదవులు తమ్ముడా!

పొట్టనిండా కూడు లేదుర
ఏమిచేయుందు తమ్ముడా!
పాడు పొట్టకు ఆకలెందుకు
కలిగినదిరా తమ్ముడా!
ఆకలన్నది ప్రాణికోటికి
సహజమైనది తమ్ముడా
దేశమంటే ఆకలేనని
ఆటమటించర తమ్ముడా!
"అరు ఔన్సులు" పిండమంత
అన్న మేలా తమ్ముడా
కరువుకాలం అరగకుంటే
అనారోగ్యం తమ్ముడా!

"అనిత్యాని శరీరాణి"
అన్న మెందుకు తమ్ముడా!
దేశమంటే మట్టిదిబ్బని
ఒప్పుకుంటిని తమ్ముడా
మట్టిలోనే గట్టిసారం
ఇమిడి వుందిర తమ్ముడా
మట్టిలోనే పుట్టి పెరిగే
మానవత్వం తమ్ముడా
మట్టినిండా గడ్డి మొలచును
మంచిసారం తమ్ముడా
సారమైనా గడ్డి తిందాం
అన్న మెందుకు తమ్ముడా!

—మహేశ్వర్